క్లుప్తంగా

సొసైటీ కార్యదర్శుల బదిలీ



కార్యదర్శులను సన్మానిస్తున్న చైర్మన్

నేలకొండపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యదర్శులు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం బదిలీ అయిన వారు ఆయా సొసైటీల్లో బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని పైనంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యదర్శి వరగాని జగదీష్‌ను బోదులబండ సొసైటీ కార్యదర్శిగా, బోదులబండ కార్యదర్శిగా అయినంపూడి నాగేశ్వరరావు పైనంపల్లికి, రాజేశ్వరపురం కార్యదర్శి వీరబాబు మోటాపురం సొసైటీకి బదిలీ అయ్యారు. అదే విధంగా రాజేశ్వరపురం కార్యదర్శిగా రంగా, నాచేపల్లి సొసైటీ కార్యదర్శిగా వెంకటరత్నంను నియమించారు. ఈ మేరకు పైనంపల్లి సొసైటీ చైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు ఇరువురు కార్యదర్శులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు వేనేపల్లి నాగేశ్వరరావు, కలకుంట్ల శ్రీను, యడపల్లి విజయ్‌భాస్కర్, చల్లగుండ్ల వెంకట్రామయ్య, చిట్లా భాస్కర్‌రెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సమితి ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: అమృత మంజరి– అంకురం 2 'తన ప్రేమగల చేతుల నైపుణ్యం' పుస్తకాన్ని సోమవారం జిల్లా మనుజ్యోతి ఆశ్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు, వివిధ విభాగాల ప్రతినిధులు ఆవిష్కరించారు. అఖిల ప్రపంచస్తుతి ధాన్య నిలయం మనుజ్యోతి ఆశ్రమం ఆధ్వర్యంలో ఒకే దేవుడు, ఒకే దేశం అనే చైతన్యంతో ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు దమ్మాలపాటి సుధాకర్‌రావు, అచలగురుగీత మందిర్ జిల్లా అధ్యక్షులు అహ్మద్ అబ్బాస్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జిల్లా అధ్యక్షులు షేక్ లతీఫ్, నిత్య నిర్మలానంద, సెలువోజు చంద్రమౌళి రాజయోగి, బెల్లం సత్యనారాయణ, ఆలస్యం నర్సింహారావు, రాయప్రోలు సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాతలకు పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ రాంబాబు తదితరులు

ఖమ్మంఅర్బన్: తలసేమియా వ్యాధి బాధితులకు సోమవారం ఖమ్మంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జయవిలాసిని రియల్ ఎస్టేట్ డెవలపర్స్ ఆధ్వర్యంలో సంస్థ అధినేత డా.కుంచపు రాంబాబు జన్మదినం పురస్కరించుకుని ఈ శిబిరం ఏర్పాటుచేశారు. జరిగింది. ఈ సందర్భంగా దాతలు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగం శ్రీను, అనంతరాజు, టీవీ రాజు, ఖాజా, చెన్ను కొండయ్య, ఆకుమయ్య, ఊర్మిళ పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఓజీ
వినోద	కాంతార
సాయిరాం	ఓజీ
ఆదిత్య	కాంతార, మిరాయ్
శ్రీనివాస	ఇడ్లీకొట్టు, మిరాయ్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	4
వంకాయ	36		20
బెండకాయ	18	పాలకూర	3
పచ్చిమిర్చి	80		20
కాకర	36	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	56	తోటకూర	4
దొండ	50		20
పొట్లకాయ	30	గోంగూర	4
చిక్కుడు	90		20
గోరుచిక్కుడు	50	మెంతికూర	3
క్యాబేజీ	30		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	28		40
చామగడ్డ	34	పుదీన	1
క్యారెట్	80		20
బీట్‌రూట్	56	-ఖమ్మం వ్యవసాయం	

ఒక్క క్లిక్ చాలు..

'సిటిజన్ బడ్డీ'లో ఫిర్యాదులు స్వీకరణ

- తక్షణ పరిష్కారానికి అధికారుల చర్యలు
- కేఎంసీకి ఈ ఏడాది 1,532 ఫిర్యాదులు
- ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు


ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా సమస్యలను తక్షణమే తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపేందుకు కేఎంసీ అధికారులు పలు రకాల చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు పౌర సేవలు అందించేందుకు ప్రభుత్వం 'సిటిజన్ బడ్డీ' యాప్‌ను అందుబాటులో ఉంచింది. అధికారులు నేరుగా కార్యాలయంలో వచ్చిన వినతులు స్వీకరించడంతోపాటు ఇంటి నుండి ఆన్‌లైన్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులను పరిశీలిస్తున్నారు. దీంతో సమస్య పరిష్కారానికి రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగకుండా స్మార్ట్‌ఫోన్‌లో యాప్‌పై ఒక క్లిక్ ఇచ్చి అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. సమస్యలపై ఫిర్యాదులు చేయడంతోపాటు పౌరసేవలు వినియోగించుకోవడం, తమ ప్రాంతాల సమాచారం తెలుసుకునేలా యాప్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఈ ఏడాది యాప్‌లో అందిన ఫిర్యాదులు

విభాగం	ఫిర్యాదులు	పరిష్కారం	పెండింగ్
ఇంజనీరింగ్	248	06	42
శానిటేషన్	696	683	13
టౌన్‌ప్లానింగ్	111	74	37
రెవెన్యూ	56	51	05
వీధి దీపాలు	266	259	07
పెన్షన్	06	06	0
ఇతరములు	148	148	0
జనన, మరణ	01	01	0

సత్వర సేవలు..

సిటిజన్ బడ్డీ యాప్‌లో ఫిర్యాదుల స్వీకరణకు పెద్ద పీట వేశారు. శానిటేషన్, డ్రెయినేజీలు, రోడ్లు, సఫాయిమిత్ర సురక్ష, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, అనధికార, అక్రమ కట్టడాలు, ఉల్లంఘనల నివేదన, ఆదాయం, వీధి వ్యాపారుల సమస్య, ఆహార పరిశుభ్రత, భద్రత, ఇతర సమస్యలపై ఫిర్యాదులు నమోదు చేసేలా సర్వీసును అందిస్తున్నారు. యాప్ ద్వారా పౌరసేవల కోసం, సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత గడువులో పరిష్కారం చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కేఎంసీలో ఈ ఫిర్యాదులను పరిశీలించి, ఆయా విభాగాలకు అందించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేశారు. ఈ గ్రీవెన్స్ సెల్‌లో నిరంతరం యాప్‌ను పరిశీలించి, వచ్చిన దరఖాస్తులను విభాగాలకు పంపడంతోపాటు ఎన్ని రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందనే విషయాన్ని ఫిర్యాదుదారుడు, దరఖాస్తుదారుడికు సంక్షిప్త సమాచారం అందజేస్తారు. ఫిర్యాదులు పరిష్కారం అయిన తర్వాత ఫిర్యాదుదారుడి నుండి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు.



సిటిజన్ బడ్డీ యాప్

అన్నీ యాప్‌లోనే..

ప్రధానంగా పౌరసేవలు, ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో సిటిజన్ బడ్డీ యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌లో కార్పొరేషన్‌కు సంబంధించిన సమాచారంతో పాటు ప్రజాప్రతినిధులు, ఆయా ప్రాంతాల అధికారులు, సిబ్బంది జాబితా, కమిషనర్, కార్యాలయ కాంట్రాక్ట్ వంటి సమాచారం ఉంటుంది. ఇక పన్ను చెల్లింపులు, ఫిర్యాదులు, ఆన్‌లైన్ సేవలు, పౌరసేవలు, దరఖాస్తు పత్రాలు, అర్బన్ వైబ్స్, ఇతర సేవలు ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. 2018 నుండి ఈ యాప్ ఖమ్మం నగర ప్రజలకు అందుబాటులోకి రాగా.. భారీ సంఖ్యలో ఫిర్యాదులు యాప్‌తో నమోదు చేస్తున్నారు. యాప్ ద్వారా పరిపాలన, ఇంజనీరింగ్, రెవెన్యూ, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ పలు విభాగాలకు సంబంధించిన పౌర సేవలను ప్రజలు పొందుతున్నారు.



ఫిర్యాదు అందగానే పరిష్కారం



స్థానిక సమస్యలపై ప్రజలు అందిస్తున్న ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తున్నాం. గతంలో గ్రీవెన్స్‌కు పెద్ద సంఖ్యలో ఫిర్యాదారులు వచ్చేవారు. ఒకే సమస్యపై రెండుమూడు సార్లు తిరిగేవారు. ఇప్పుడు ప్రజలకు ఆ పరిస్థితి లేకుండా సేవలు అందిస్తున్నాం. రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి ప్రజలకు సేవలు అందించేందుకు కేఎంసీలో రెవెన్యూ విభాగానికి సంబంధించి ఇప్పటికే ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశాం. వారంలో టౌన్ ప్లానింగ్ కోసం కౌంటర్‌ను ఏర్పాటు చేస్తాం.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

కేఎంసీ సమాచారం..



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అభిషేక్

గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరించిన కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 16 ఫిర్యాదులు అందగా.. వాటిని ఆయా విభాగాల అధికారులకు అందజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆస్తి పన్ను సవరణలపై వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కమిషనర్ రెవెన్యూ విభాగ అధికారులకు సూచించారు. నార్త్, సౌత్ జోనల్ కార్యాలయాల్లో గ్రీవెన్స్ నిర్వహణపై కమిషనర్ అధికారులతో మాట్లాడి, అక్కడ అందుతున్న ఫిర్యాదుల గురించి తెలుసుకున్నారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన..

నగరంలోని పారిశుద్ధ్య పనుల నిర్వహణను డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్ పరిశీలించారు. తెల్లవారుజాము నుండే డీసీ నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పనుల నిర్వహణను పర్యవేక్షించారు. ఇక జటాయువు, స్వీపింగ్ మిషన్ల పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలు చేస్తున్నట్లు డీసీ తెలిపారు.

వేతనాలు చెల్లించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పార్ట్‌టైమ్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వారు సోమవారం ఖమ్మంలోని ఎన్ఎస్పీ క్యాంపులో గల జోనల్ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకు వేతనాలు చెల్లించలేదని, కుటుంబాలు గడవడం కష్టంగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతంతో పనిచేస్తున్న వారికి కనీసం నెలనెల వేతనాలు ఇవ్వడం లోనూ వివక్ష చూపుతున్నారన్నారు. ఈ ఆందోళనకు స్వేరోలు మద్దతు పలికారు. స్వేరో నాయకులు ఉదయ్ మాట్లాడుతూ... ఒక పక్క ఎస్సీ సంక్షేమ గురుకులాల్లో ఉపాధ్యాయులకు వేతనాలు ఇవ్వక విద్యార్థులకు విద్య అందకుండా పోతుంటే.. మరో పక్క బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఫీజులు పెండింగ్ వలన పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను వెనక్కి పంపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పృథ్వీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో స్వయం సేవకుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న రమేష్

ఖమ్మం మామిళ్లగూడెం: దేశరక్షణలో స్వయం సేవకుల పాత్ర కీలకమని బౌద్ధిక ప్రముఖ్ కవిడి రమేష్ అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు పురస్కరించుకుని సోమవారం రిక్కాబజార్‌లోని శ్రీరామ్ ప్రభాత్‌శాఖ సమావేశం శ్రీ శ్రీ భారతి తీర్థ స్వామి పర్వచన మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం విపత్కర పరిస్థితుల్లో ఉన్నప్పుడు దేశ సేవకులుగా స్వయంసేవకులు అందించిన సేవలు కొనియాడారు. ఎలాంటి స్వార్థం లేకుండా దేశం కోసం నిస్వార్థంగా పనిచేసేవారే స్వయం సేవకులన్నారు. వేములపల్లి సీతా రాంబాబు, మంగీలాల్ పురోహిత్, మార్తి వీరభద్ర ప్రసాద్, సంతోష్, సూర్య, గద్దం అశోక్ గౌడ్, ధారా శ్యాము, బలవంతు పురోహిత్, ధారా ప్రసాద్, కొంకిమళ్ల మృత్యుంజయరావు, జెల్లా రాంబాబు, విష్ణు, సరస్వతి, భార్గవి, భవాని, విశాలి, మేఘన పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఖమ్మం మామిళ్లగూడెం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక 6వ డివిజన్ ఖైకొండాయిగూడెం స్టేజీ దగ్గర ఖానాపురం హవేలి చెరువు పక్కన ఉన్న హజరత్ ఖాజా గరీబ్‌నవాజ్ దర్గా సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆవాజ్ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌కె.నాగుల్ మీరా, షేక్‌బాబు మాట్లాడుతూ.. ఈ దర్గా స్థలం అన్యాక్రాంతమైందని, స్థలాన్ని కాపాడాలన్నారు. అలాగే వీధి లైట్లు, తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. యస్‌కె.హుస్సేన్, యస్‌కె.ఖాసిం, యస్‌కె.సుభాని, యస్‌కె.సాహెబ్ హుస్సేన్, మైబూబీ, ఖాదర్‌బీ, హనీఫా, సుందర్‌రావురెడ్డి, సుల్తానా, రౌహ నాబీ, హుస్సేన్, పాషా తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ డివిజన్ వైఎస్సార్ నగర్‌లో ద్విచక్రవాహనం చోరీపై సోమవారం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం వైఎస్ఆర్ నగరంలో నివసించే పలిమెల రాము గత నెల 16 రాత్రి తన ఇంటి ముందు నిలిపిన ద్విచక్రవాహనం ఉదయం కనిపించకుండా పోయింది. ఎంత వెతికినా దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

హైవే భూసేకరణ నిలిపివేయాలి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

రఘునాథపాలెం: నాగపూర్ – అమరావతి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే భూ సేకరణను హైకోర్టు తుది ఉత్తర్వులు వెలువడే వరకు తాత్కాలికంగా నిలిపివేయాలని మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు సోమవారం ఆర్డీఓ నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖమ్మం నగర పరిధి మధ్యగా ప్రతిపాదించిన ఎక్స్‌ప్రెస్ హైవే చట్టవిరుద్ధమని హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశామని ఈ పిటిషన్లు విచారణలో ఉన్నాయన్నారు. హైకోర్టు ఇప్పటికే ఈ కేసులపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కేసులు ప్రస్తుతం చివరి వాదనల దశలో ఉన్నాయని వివరించారు. రేగులచలక గ్రామ పరిధిలో తీర్థాల నుండి వీవీపాలెం వరకు భూములకు సంబంధించిన రైతుల బ్యాంకు వివరాలు సమర్పించాలని నోటీసు జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయపరమైన గౌరవం కాపాడేందుకు తుది తీర్పు వెలువడే వరకు చర్యలు నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు జేఏసీ నాయకులు శ్రీధర్, తక్కిళ్ల పాటిభద్రయ్య, ప్రతాపనేని రంగారావు, బోజడ్ల వెంకటయ్య, మాధవ్, ప్లాట్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

ఖమ్మంఅర్బన్: పోగొట్టుకున్న ఫోన్‌ను వ్యక్తికి గుర్తించి సోమవారం అర్బన్ స్టేషన్‌లో సీఐ భానుప్రకాష్ అందజేశారు. నగరంలోని బల్లేపల్లికి చెందిన రెడ్డి బోయిన వరుణ్ తన ఫోన్‌ను ఇటీవల పోగొట్టుకుని ఫిర్యాదు చేశాడు. దీంతో ఫోన్‌ను గుర్తించి వరుణ్‌కు అందజేశారు.

నివాళి

ఖమ్మంరూరల్: మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు మాతృమూర్తి వరలక్ష్మీ వర్ధంతి సందర్భంగా సోమవారం గొల్లగూడెంలోని నామా ముత్తయ్య, వరలక్ష్మీ స్మృతివనంలో నివాళులర్పించారు. నామా సోదరులు సీతయ్య, కృష్ణయ్య, సోదరి ధనమ్మ, తరుణ్, కనకమేడల సత్యనారాయణ, గొడ్డేటి మాధవరావు, మోరంపూడి ప్రసాదరావు, తన్నీరు రవి, వాకదాని కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి

తిరుమలాయపాలెం: ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు (బెస్ట్ అవైలబుల్ విద్యాసంస్థలకు) నిధులు విడుదల చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని పాలేరు నియోజకవర్గ స్వేరో అధ్యక్షులు కోండ్రు రామచంద్రు డిమాండ్ చేశారు. నిధుల విడుదలలో జాప్యంతో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు నిధులు విడుదల చేయాలని కోరారు.

నేడు వైద్యశిబిరం

కామేపల్లి: మండలంలోని మద్దులపల్లి గ్రామంలో ఐటీడీఏ భద్రాచలం, వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కామేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నెల్లూరి చందన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో స్త్రీ వైద్య, చిన్న పిల్లల వైద్యులు, కంటి, చర్మ వ్యాధి నిపుణులు హాజరవుతారని ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరిపంట పరిశీలన

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లి గ్రామ పరిధిలో వరి పొలాలను ఏఓ కర్నాటి ఉమామహేశ్వర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరి పంటలో ప్రస్తుతం అగ్గితెగులు ఉధృతిగా ఉందన్నారు. ఈ తెగులు నివారణకు ఐసోప్రోథయోనిల్ ఎకరానికి 400 మిల్లీ లీటర్లు, లేదా ట్రైసైకలాజోల్ 200 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేస్తే అగ్గితెగులు నియంత్రించవచ్చన్నారు.

నేడు రైతునేస్తం..

మండలంలో రైతునేస్తం కార్యక్రమం మంగళవారం ఉదయం 10 గంటలకు వీవీపాలెం, రాంక్యాతండా రైతువేదికలో నిర్వహిస్తున్నట్లు ఏఓ కర్నాటి ఉమామహేశ్వర్ రెడ్డి తెలిపారు. వరిలో ప్రస్తుతం సోకుతున్న అగ్గితెగులు నివారణ చర్యలపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు ఇవ్వనున్నారని పేర్కొన్నారు. సీసీఐకు పత్తిని అమ్మే ప్రక్రియ, కపాస్ కిసాన్ యాప్ వినియోగంపై సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాబాను దర్శించుకున్న మేయర్



ఖమ్మంమామిళ్లగూడెం: మేయర్ పునుకొల్లు నీరజ తమ కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబా మందిరాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 11 కేవీ పాకబండ ఫీడర్‌లైన్ మరమ్మతుల దృష్ట్యా నేడు (మంగళవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఖమ్మం టౌన్–2 ఏడీ యాదగిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మమతారోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడనుంది. ఉదయం 9 నుండి 11 వరకు గొల్లగూడెం రోడ్, మధురానగర్ రోడ్డు 1 నుండి 12 వరకు, గొల్లగూడెం, బృందావన్ వెంచర్, సాయినగర్ ప్రాంతాల్లో, అలాగే ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు, 11 కేవీ శ్రీనగర్ కాలనీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శ్రీగర్‌కాలనీ రోడ్ 6 నుండి 16 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు ఎన్నికల అధికారులకు శిక్షణ

రఘునాథపాలెం: స్థానిక ఎన్నికల నిర్వహణకు రఘునాథపాలెం రైతువేదికలో ఎన్నికల ప్రొసీడింగ్ అధికారులకు బుధవారం మొదటి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. మండలంలోని 110 మంది అధికారులు ఈ శిక్షణలో పాల్గొంటారని, వారికి అనుభవజ్ఞులైన అధికారులు శిక్షణ అందించనున్నారు.

జవాన్ దహన సంస్కారాలకు సాయం

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ జవాన్‌గా పనిచేస్తున్న నగరంలోని 43వ డివిజన్ మున్సిపల్ క్వార్టర్స్ నివాసి కె.వీరబాబు సోమవారం మృతిచెందగా అతని దహన సంస్కారాలకు కమిషనర్ అభిషేక్ అగస్త్య తక్షణ సాయంగా కేఎంసీ నుండి రూ.20 వేల ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ మేరకు శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా వీరబాబు మృతదేహాన్ని కేఎంసీ అధికారులు, సీపీఎం, సీఐటీయూ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యులు, కార్పొరేటర్ బిజి క్లైమెంట్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ప్రక్షాళనకు పైరవీలతో కళ్లెం..



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కార్యాలయం

- అధికారులపై ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ఒత్తిళ్లు?
- అడిగిన పోస్టు ఇవ్వకుంటే సెలవులపై సిబ్బంది
- జవాన్ పోస్టులు అమ్మకానికి పెట్టారన్న విమర్శలు

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ పరిపాలనను గాడిన పెట్టేందుకు అధికారులు పకడ్బందీగా చర్యలకు పూనుకుంటున్నా రాజకీయ, అధికార హోదాలను ఉపయోగించుకొని కొందరు వాటికి కళ్లెం వేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. కొందరు ఉద్యోగులు, సిబ్బంది పాల్పడుతున్న అక్రమాలను అరికట్టేందుకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇటీవల చర్యలకు ఉపక్రమించారు. రెవెన్యూ విభాగంలో బిల్లు కలెక్టర్లు, ఆర్ఐలపై వచ్చిన ఫిర్యాదులతో ఆ విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అక్కడ డిప్యూటేషన్‌పై పని చేసే సిబ్బందిని తొలగించి, వారి విధులకు వారిని కేటాయించారు. అయితే ఒకరిద్దరు తమ పలుకుబడిని ఉపయోగించుకొని అదే స్థానంలో కొనసాగుతుండగా మరి కొంతమంది తమ స్థానాలకు వెళ్లకుండా పైరవీలతో అధికారులపై ఒత్తిళ్లు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

అడిగిన పోస్టు ఇస్తేనే..

కొందరు సిబ్బంది తమకున్న అండ చూసుకుని అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అడిగిన పోస్టు ఇస్తేనే పని చేస్తామని లేకుంటే విధులకు ఎగనామం పెడతామనే సంకేతాలు పంపిస్తున్నారు. బిల్‌కలెక్టర్ నుంచి తొలగించిన వారిలో ముగ్గురు సిబ్బంది ఇదే తీరును వ్యక్తపరుస్తున్నట్లు తెలుస్తోంది. ఇక సెలవులు పెట్టకుండానే నగరం వదిలి వెళ్లి బయట ఊళ్లలో, పట్టణాల్లో తమ పనులు చక్కబెట్టుకొని వస్తున్నారన్న చర్చ ఉంది. దీనిపై కమిషనర్ సైతం సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల జోక్యంతో కేఎంసీలో ప్రక్షాళనకు గండిపడుతుందన్న విమర్శలున్నాయి.

నచ్చిన పోస్టు కోసం..

దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా అండగా ఉండే రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారుల మాట నడిచే సమయంలోనే తమకు నచ్చిన పోస్టులో పనిచేసేందుకు, కావాల్సిన పోస్టును తెచ్చుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. రెవెన్యూ విభాగంలో బిల్ కలెక్టర్, శానిటేషన్ విభాగంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్ల పోస్టుల కోసం కొందరు సిబ్బంది తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇక జవాన్, ఎస్సై పోస్టులను ఇచ్చేందుకు అధికారులు, కార్మిక సంఘాల నేతలు, ఇతరులు బేరాలు చేస్తున్నట్లు తెలిసింది. నాలుగు పోస్టులు ఖాళీగా ఉండగా ఒక్కో పోస్టును రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు అమ్మకానికి పెట్టారనే చర్చ కార్మికుల్లోనే జరుగుతుండడం ఇందుకు నిదర్శనం. రెవెన్యూ విభాగంలో బిల్ కలెక్టర్ల అక్రమాలు బయటపడడంతో కమిషనర్ డిప్యూటేషన్‌పై ఉన్న సిబ్బందిని తొలగించి, వార్డు ఆఫీసర్లకు విధులు కేటాయించారు. అయితే ఓ ఇద్దరు మాత్రం తమ డిప్యూటేషన్ రద్దు కాకుండా పైరవీలు చేయించుకున్నారన్న చర్చ వినిపిస్తుంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లి నిర్మల హైస్కూల్ 2006–2007 బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నగరంలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత మిత్రులను కలిసి అప్పటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. గురువులను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు, పాటలు ప్రదర్శిస్తూ ఉత్సాహాన్ని పెంచారు.